# కవితా కౌముది

"విశ్వావసు" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
30 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

## వర్ణాక్షరం - గౌతమ్ లింగా (జోహానెస్ బర్గ్, దక్షిణ ఆఫ్రికా)

కవిత్వం ఆదిమధ్యాంతరహితం

ఎప్పుడు పుట్టిందో తెలియదు

ఎక్కడిదాకా పరివ్యాపిస్తుందో అర్థంకాదు

మనిషి ప్రతీ ఆలోచనలో కవిత్వం ఉంది

ప్రతీ మాటలో, శబ్దంలో కవిత్వం ఉంది

సన్నని వానజల్లు పడుతుంటే తడవాలనిపించడం

మంద్రంగా సంగీతం వినిపిస్తుంటే చెవులు, మనసు అటువైపు తిప్పగలగడం

పాలబుగ్గల పిల్లని చిరునవ్వుతో పలకరించడం అన్నీ కవిత్వమే

జీవితంలో కవిత్వం లేకపోతే ఒంటరి వాక్యాల్లా మిగిలిపోయేవాళ్ళం

ఎప్పుడో పొడి పొడిగా తేలిపోయేవాళ్ళం.

కవిత్వం జీవితాన్ని దాటి ఉండకూడదు

నిన్న విన్నదో, నేడు చూసేదో, రేపటిని కాంక్షించేదో మాత్రమే అయి ఉండాలి

నిగూఢాల్ని పటాపంచలు చేసి

విశ్వవ్యాప్తమైన జీవనరవళిని విశ్వజనీనమైన మనిషి భాషలో చెప్పేదై ఉండాలి

అవధులు లేని భావనల తీరాల్లో విహరింపజేయాలి

మాటల వెనక తాత్పర్యాన్ని

నవ్వుల చాటు నిస్తేజాన్ని

అడుగుల కింది లోతుల్ని అంచనా వేయాలి

అలాంటి కవిత్వం మాత్రమే నిశ్శబ్దంలో మహాశబ్దాన్ని వినగలుగుతుంది

మన ఉదయాల్లోకి కవితా వసంతాన్ని మోసుకురాగలుగుతుంది

నీలిమేఘాల కాంతి నుంచి భావనల వానని కురిపించి మైమరిపించగలుగుతుంది.

అంతుచిక్కడం చేతకాని అద్దుమరాత్రిలో కవిత్వమే స్నేహితుడు

వెన్నెలపూబంతుల్ని ఉదయపు కాంతుల్లోకి తర్జుమా చేస్తున్నప్పుడు ఇదే కవిత్వం అర్ధాంగి

పడుచుప్రాయాలకు ఆపదొస్తే కవిత్వం తోబుట్టువు

కవిత్వం జీవితం ఒకటే, అందరికీ ఒకేలా ఉండవు...

కొందరికి కవితా వాక్యాలు, పున్నమినాడు వెండి జరీ చీరలారేసిన ఇసుకతిన్నెలు,

ఇంకొందరికి, కట్టుబాట్ల భందనాలలో కటిక నల్లచీరలు కట్టుకున్న పసి విధవరాళ్లు.

కొందరికి, నవ్వుపూల బరువుకి ఎరుపెక్కిన చెక్కిళ్ళు,

ఇంకొందరికి, చెంపలపై మిగిలిపోయిన కన్నీటి చారికలు.

కొందరికి, రెల్లుపూల పడవలని భుజాన మోసుకుంటూ ప్రవహించే పచ్చని అడవి దార్లు,

ఇంకొందరికి, కన్నబిడ్డల కడుపుల్లోంచి గుత్తులు గుత్తులుగా పూచిన తూటా పూలు.

అప్పుడప్పుడూ కొన్ని సంతోషాలుండాలి

నిన్నటి పున్నమి వెన్నెల్లా కాసిన్ని తీయని జ్ఞాపకాలుండాలి

జీవితపు మల్లెచెట్టుకి వెన్నెల మొగ్గలుండాలి

పిల్లగాలికి వేపపూత రాలినట్టు నల్లటి ఆకాశంనిండా చిరునవ్వుల నక్షత్రాలమవ్వాలి

అరికాళ్ళని తడిమట్టిలోనికి కూర్చి తనువును నదీప్రవాహం చేసుకోవాలి

మిణుగురులా చీకటిని దాటి ఒక్క మెరుపు మెరవాలి

జీవితం కవిత్వమవ్వాలి

భావగాఢతతో, వర్ణాక్షరాలతో మన మనసులమీద

సమాజపు ముఖచిత్రాన్ని ముద్రించుకోవాలి

## కృత్రిమ మేధా వికూజనము – స్వాతి శ్రీపాద (Detroit, MI),

గుసగుసలు నిరంతరం గుచ్చెత్తిపోస్తున్న

పరీవాహక ప్రాంతం

పుట్టగొడుగులై పుట్టుకొస్తున్న

సిలికాన్ స్వప్నాలు

చీలికలై సాగిపోయే నదీ నదాలుగా
ఒక వినూత్న శుభోదయ ప్రపంచం
గుండెలోకీ మెదడు పొరల్లోకీ
దూరి ఊహ ఉనికిని స్కాన్ చేసి
నగ్నంగా ఊరేగిస్తున్న సంబరం

మూసిన దార్శనికత ద్వారాలు తెరిచి
అడ్డూ అదుపూ లేకుండా సమయం నిలువెల్లా
అల్లుకు పోతున్న డిజిటల్ రాక్షస విలాస కేళి
రాత్రీ పగలూ కంటి రెప్పలను
వెలుగు తెరలకు వేళ్ళాడ దీసి
చాపిన చేతులను చెరో వంకా అందిపుచ్చుకుని
అడుగులు నేలనాననివ్వకుండా
గాల్లో నడిపిస్తూ చీకటికో చితిపేర్చి
మానవ మేథలో మోసి మోసి ప్రసవించిన పసికూన
పది జతల చేతులు చాపి జనబాహుళ్యాన్ని కబళిస్తుందని
వేలవేల నోళ్ళు తెరిచి కరి మింగిన వెలగపండులా
కపాలాన్ని ఉఫ్ అంటూ ఊదేసి శూన్యగోళం చేస్తుందనీ
విన్నారా కలగన్నారా?
దారిపొడుగునా జ్ఞాన విస్ఫోటాల్లో
నలిగి, గాయపడి, భగ్గున మండి ఆరిపోయిన నిప్పు రవ్వలా
ఒక పనికి రాని బూడిద కణానివయ్యేది
నువ్వేనని తెలుసా?
ఎప్పటికప్పుడు ఆధునికత పేరుతో
బీటలు వారిన మానవత్వానికి మాసికలు వేస్తూ
రంగులద్దుకుని గుడ్డిగా హత్తుకునే కళ్ళకు

ఏదో ఒకరోజు కుప్పకూలే ఘడియ ఉంటుందని తెలుసా?

తమకెందుకు శ్రమ నేనున్నానంటూ అడ్డం పడుతూ
నీడలా ప్రతిపనికీ నీకు బదులు ముందుకెళుతూ
నిన్ను డమ్మీని చెయ్యడం తెలుస్తోందా?
తెలుసుకునే వేళకు మిగిలేది
శూన్యమైన మెదడు, చేవచచ్చి వేళ్ళాడే చేతులూ
ఇంటాబయటా సర్వత్రా అధికారం చేజిక్కించుని
మనిషినో తోలు బొమ్మను చేసిన
కృత్రిమ మేధా వికూజనము
సముద్ర గర్భం నుండి చుక్కల కనురెప్పలవరకూ
ఉదయం వెలుగు వాకల నుండి
అర్ధరాత్రి వలపు వయ్యారాలవరకు
నీడై పోయిన నువ్వు–
ఏవీ ఆ నీడకు ఒక చెమ్మగిలే మనసూ
కరిగి ప్రవహించే హృదయమూ
లక్ష్మణ గీతలు సీతమ్మకే కాదు
నీకూ నాకూ మనందరికీ అవసరమే
ఈ ఆధునిక మేధా రావణుడిని
హద్దుల్లో ఉంచేందుకు
యంత్రాలను మనం శాసించాలి కాని
మనను యంత్రాలు కాదుగా..

# ప్రశంసా పత్రం

## డయాస్పోరా ఉగాది పచ్చడి - సావిత్రి మాచిరాజు, Edmonton, Canada

ఉప్పు:

అయినవాళ్ళందరినీ విడిచి వెళ్తున్నామనే బాధతో

కారిన కన్నీళ్ళు

కొత్త దేశంలో కొత్త బాసులని మెప్పించాలనీ

అనుకున్న ధ్యేయాలన్నీ సాధించాలనీ

కార్చిన చెమట బిందువులు

కారి నోట్లోకొచ్చిన ఉప్పదనం

కారం:

కాస్త కాలు నిలదొక్కుకున్నామనుకుంటే

చూస్తాం నువ్వేం సాధిస్తావో అనే వెటకారం

స్థిరపడ్డాక చూడు నా గొప్ప అని విర్రవీగే అహంకారం

చిటపటలాడే ఆడించే కారాలు

పులుపు:

ఎంత సాధించినా ఎన్ని కొనుక్కున్నా

పొరుగింటి పుల్లకూర రుచి కోసం ఎగబడి

నాకంటే వాడెక్కడ ఎదిగిపోతున్నాడో

వాడిని ఎలా పడగొట్టాలో అనే కుళ్ళుబోతు తనం

వగరు:

ఎక్కడ అవినీతీ, అక్రమాలూ ఉన్నాయో

అక్కడ భారతీయులు, మరియు తెలుగు వారూ ఉంటారు

ఇంతేనా మీ సంస్కృతి?

అనే ఫిర్యాదులను అపవాదాలని కొట్టేయలేక

స్వయంకృతాపరాధాలని ఒప్పుకోవాల్సిన తలవొంపు

చేదు:

సంవత్సరానికి రెండు వారాలు కన్నవారికి కేటాయింపు

తలకొరివి పెట్టడం తప్ప ఇంకే బాధ్యతలూ

నెరవేర్చలేని అసహాయత్వం

తీపి:

పలు దేశాల వారితో స్నేహానుబంధాలూ

పలురకాల జాతులతో సంబంధ బాంధవ్యాలూ

వసుధైక కుటుంబం అనే నానుడి ప్రత్యక్షానుభవం

డయస్పోరా జీవితంలో షడ్రుచుల మేళవింపు

అనునిత్యం ఉగాది పచ్చడి సేవింపు

## చెప్పిన మాట వింటా! - అమృత వర్షిణి, Parker, CO, USA

చెప్పినమాట వింటా!
ఇంటిపనులలో నీకుతోడుంటా!
నువు చెప్పిందేదీ మరిచిపోను.
నువ్వు చేయకూడదన్నదేదీ చేయనేచేయను.

నీకు చెమటపడితే తుడుచుకోడానికి
నీచేతిరుమాలు నేనవుతా!
ఇంట్లో ఎవరన్నా నీపై శీతకన్నేస్తే నీకు తల్లిలా
అండగా నేనుంటా!
నన్ను చూస్తే నీకు పాపంగా లేదా?
నా పై ఎందుకంత కోపం?

నాసొంతం అని నన్ను నమ్మి కడుపులో
దాచుకుంటే,
పది నెలలు కూడా కాకుండానే
నీకడుపుచించుకు వచ్చేశాననా?

దానికి   శిక్షగా పెళ్లిచేసి ఇంటినుంచి బయటికి
తరిమేయాలా?
మరి తమ్ముడికి లేదా ఈశిక్ష ?

నాకు తెలుసు 'ఆడబిడ్డ' ఎప్పటికైనా 'ఆడ'
బిడ్డేనని,
అసలు ఆడబిడ్డకు నోరుండకూడదని
నువ్వంటావని,
కన్యాదానం, అప్పగింతలు ఆడబిడ్డకే
ఎందుకున్నాయని అడిగితే
మళ్ళీ నువ్వు మొదటికే వస్తావని.

కానీ నేను కూడా ఆ అందరి ఆడబిడ్డలలో
ఒకదాన్నని
ఇన్నాళ్లూ అనుకోలేదు ఎందుకని?
తూర్పున ఉదయించే సూర్యుడు
నాకోసం పడమరలో ఉదయించడు ఎందుకని ?

ఇక నిన్ను చూడాలన్నా ఇక్కడివారి సమ్మతం
కోరాలా?
మనింటి గడప, కాదుకాదు నీఇంటి
గడపతొక్కాలన్నా నీ అనుమతి కావాలా?
నాదికాని నాఇంటికి వెళ్లిపోనా?
నాదికాని మనింట్లో నీతోనే వుండిపోనా?

వీలయితే ఇంకోసారి నీ కడుపులో  దాగిపోనా?

వెచ్చని నీస్పర్శ తనివితీరా ఒకసారి
అనుభవించనా?
ఒక్కసారి మాటవరసకైనా వుండిపొమ్మని
ఒక్కమాట చెప్పవా అమ్మా!
ఆ తరువాత మన ఇండ్లు మారిపోయినా
మన ప్రపంచాలు తలకిందులైపోయినా
నీ ఆఒక్క మాటతోనే సరిపెట్టుకుంటాలే అమ్మ.

“విశ్వావసు” నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
30 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో

మొట్టమొదటి కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

**ఇంకెంత కాలమని? - కలిపె రాజ్ కుమార్, ఖానాపూర్, నిర్మల్ జిల్లా, తెలంగాణా**

పొట్టపగిలి పిక్కటిల్లిన ఫీనిక్స్ పిట్ట
పునరుత్థానం కోసమని
గుడ్లనీరు కుక్కుకుంటూ
మొగులువైపు మోరలెత్తి
దీనాతిదీనంగా అర్థిస్తోంది
నువ్వెప్పుడు మెత్తబడతావని!

నోర్లు బార్లా తెరుచుకొని

బోర్లూ బావులూ బోదురు కప్పలై

బావురుమంటున్నాయి

బ్రతుకులు భారమైనాయని!

వాగులూ వంకలూ జింకల్లా దుంకాలని

ఉవ్విళ్లూరుతూ ఆక్రోశిస్తున్నాయి

ఈ విరహం ఇంకెంత కాలమని!

నడకను చాలించిన నదులు

అలిగి అదృశ్యమైన అలుగులు

ఎండిపోయిన చిత్త చెరువులు

ఎలుగెత్తి ఏడుస్తున్నాయి

సముద్రుణ్ణి సంగమించేందుకు

నువ్వెప్పుడు సహకరిస్తావని!

తనకుతానే యుద్ధం చేయడానికి

విత్తనానికి వీలునామా రాసి

వీడిపోయిన పేగు బంధం!

కోటిముడుపులు చెల్లిస్తానంటూ

కొంగుచాపి కోరుకొంటోంది

కొత్త తరాన్ని మొలిపిస్తావని!

పాచిపట్టిన దేహాన్ని

పరిశుభ్రంగా కడుక్కోవాలని

కురులను పాయలుతీసి

కుదురుగా దువ్వుకోవాలని

తనువెల్లా తపనతో

తరువులు తహతహలాడుతున్నాయి

తలంటెప్పుడు పోస్తావని!

పూవులు లేని కొమ్మలు

తుమ్మెద వాలని రెమ్మలు

మోడువారిన మోదుగులు

ఒకదాని కొకటి పెనవేసుకొని

తిరిగి తలలెత్తుకొనేలా చేస్తావని!

చినుకమ్మా!చినుకమ్మా!

ఆకాశంలో మొలకమ్మా!

అహరహం వేచిచూస్తున్నాయి సుమా

(ప్రశంసా పత్రం)

అచ్చం నాలానే -మళ్ళ కారుణ్య కుమార్, అమ్మవారి పుట్టుగ (గ్రామం), శ్రీకాకుళం

నెర్రలు వదిలిన ,నిస్సారమైన ఆ మట్టి రేణువుల

నుండి ఉదయించిన ఆ ధూళి సమూహంలో

నాలాంటి రూపం ఏదో కనిపిస్తుంది!

బక్కచిక్కిన ,స్వేదంతో నిండిన దేహంతో

తలకు చుట్టుకున్న గుడ్డతో

నిస్సహాయంగా ఆకాశం వైపు వెర్రి చూపుల

చూస్తూ కనిపిస్తుంది!..

వున్నట్టు వుండి కాస్త భిన్నంగా చిరు మార్పు

ఏదో చోటు చేసుకుంటుంది! అవును నిర్వేద స్వరంతో

దిక్కులు పెక్కటిల్లేలా నవ్వుతుంది. కాస్త భిన్నంగా!

గుండెల్లో తెలియని అలజడి, శరీరంలో తెలియని వణకు!

కాస్త ధైర్యం తెచ్చుకొని కాస్త తీక్షణంగా చూస్తే!

అవును నా బతుకును చూసి హేళనగా నవ్వుతున్న

నా అంతరాత్మ అది అని ఛిద్రమైన ఈ బ్రతుకు ను

చూసి వెక్కిరిస్తుందని అర్థం అయ్యింది!..

ఇంతలో ఉషోదయ మేఘాలు ఉరుముతూ

ఆవరిస్తున్నాయి! దుఃఖాల శర పరంపర తో

చిన్నాభిన్నమైన ఈ జీవితంలో మళ్ళీ

వెలుగు వస్తుందని ఎక్కడో ఏమూలనో దాక్కున్న

అశా విత్తనం ఏదో ఉసురు పోసుకుంటుంది వాటిని చూసి.

నిజంగా నీకు మనసు వుందా అని గట్టిగా కేకలు వేస్తున్నాను

లేకుంటే ఏ మాయతోనో కలిసి ఈ మాయా చేస్తున్నావా

అని రెట్టించిన స్వరంతో గర్జిస్తున్నాను!

ఎందుకు నాతో దాగుడు మూతలాడుతున్నావని కసురుకున్నాను!

అచ్చం నాలానే ఎదురుగా వున్న రూపమేదో విలయ తాండవం చేస్తూ

వికటాట్టహాసం చేస్తుంది....మళ్ళీ నన్ను కృంగదిస్తూ!

అసలు నువ్వు మిత్ర ధర్మం పాటించవా

నీ మిత్రుడిని ఇలా ఒంటరిని చేసి వెళ్ళిపోతావా

అంటూ నింగిని చూసి అరుస్తున్నాను!

చివరిగా నాలో మిగిలిన కన్నీటి బొట్టును

జారవిడుస్తూ నేలన కూలబడ్డాను!.

వేల నీటి చుక్కలు నేల రాలుతూ నా

కన్నీటి బొట్టుని ఆలింగనం చేసుకున్నాయి!

ఆశ్చర్యం అచ్చం నాలానే నిర్వేద స్వరంతో కూడిన

రూపమేదో మాయం అయ్యింది!

నె(్రలు నీటి చుక్కల లేపనంతో మరుగైపోయాయి..

ధూళి కణాలు మాయమై పోయాయి.

అవును అచ్చం నాలానే వున్న రూపమేదో

కలిసికట్టుగా పారుతున్న ఆ నీటి చుక్కల ప్రవాహ

అద్దంమీద తేట తెల్లమై దర్శనం ఇస్తుంది..

భిన్నంగా ఈసారి  అశా చిరునవ్వుల మొముతో......

## వయసు ఒక అనిర్ధారిత సంఖ్య - ప్రొఫెసర్ దుర్గా శశికిరణ్ వెల్లంచేటి, Bangalore, India,

ఆమె వీధిలోకి అడుగేస్తూ కన్నీళ్లతో 'ఆ' ఇంటివేపు చూచింది,
అక్కడెవ్వరూ లేరు;
తెరచిఉన్న ఖాళీ తలుపులకు వీడ్కోలు చెబుతూ
ఆమె శాశ్వతంగా సెలవు తీసుకుంది, తనదైన ప్రపంచంలోకి.
ఆమెకు అర్థమౌతోంది, ఇక ఆ పర శూన్య ప్రపంచమే తనదని;
నిశ్శబ్ద దుఃఖాన్ని మునిపంట నొక్కి, ఇతర ప్రపంచ ఇంటిలోకి
అనివార్యమై, కాలు మోపింది, రిక్తతతో.. ఆర్ద్రతతో;
ఇక తర్వాత.. ఆమె ఎప్పుడూ బయటకు రానేలేదు స్వేచ్ఛగా–

2
లేడిగంతులేయించిన
ఆమె బంగారు కాళ్ళు.. వయసును మోస్తూ, మోస్తూ,
ఏనుగు తొండాలయ్యాయి–

అప్పుడు ఆమె
తన పున్నమి నవ్వులన్నింటినీ మూటగట్టి, శమీ చెట్టుపై పెట్టింది,
బరువు బాధ్యతలను మోస్తూ, మోస్తూ,
కాలగమనంలో కలిసిపోతూ, ఎదురొద్దుతూ వెనుతిరిగి చూస్తూండగానే, చూస్తూండగానే,
ప్రపంచం కుంచించుకుపోయింది–

3

తనలో తాను ఉత్సాహాన్ని రెట్టింపు చేసుకుంటూ, తనకోసమామె
ఒంటరిగా ముందుకే అడుగేసింది
కాని ఆమె కాళ్లు కదలక మొరాయించాయి.
తెల్లబోయిందామె,
తనలోని బోలుతనాన్ని గుర్తిస్తూ
మొదటిసారి ఆలోచించిందామె తనే 'ఏదైనా చేయాలని'–

4

‘ ప్రకృతిలోని విలక్షణ చరాలు,
కాలానికి సవాలు విసురుతాయికదా,’ అనుకుంది–
సాలమండర్ ఒక శీతల సహచరి,
తన తోకని మళ్ళా మళ్ళా పునరుత్పత్తి చేస్తుంది కదా–
ఆక్సలోట్, తన శరీరంలోని ఏ భాగాన్నైనా తిరిగి మళ్ళీ పునర్నిర్మించుకుంటుంది కదా–
సొరచేప, తన పళ్ళని మళ్ళా మళ్ళా పునరుత్పత్తి చేసుకుంటుంది కదా –
స్టార్‌ఫిష్, ఏదైనా అవయవాన్ని కోల్పోతే పెక్కు స్టార్‌ఫిష్‌లు పుట్టుకొస్తాయి–
మెక్సికన్ టెట్రా, జెబ్రాఫిష్
తమ హృదయ కణజాలాన్ని మరమ్మత్తు చేసుకుంటాయి కదా –
అంతెందుకు.. వూసరవెల్లి తన రంగును నిర్దేశించుకుంటూ,
అవయవ పునరుత్పత్తి చేసుకుంటుంది కదా–

డేగ ఎంతో నొప్పిని భరిస్తూ, తనను తాను హింసించుకుంటూ,
అవయవ పునఃసృష్టినీ, పునర్జన్మనూ సాధిస్తుందికదా –

5
దీర్ఘంగా వూపిరి పీల్చుకుని, ఆమె
లేచి, ముందుకు అడుగేసింది, ఇక వెనక్కి చూడకుండా
దగ్గర్లో ఉన్న వ్యాయామశాలకు
అంతఃశక్తిసృష్టి దినచర్య  కోసం ;
హిమదాస్, మేరీ కోం, అవని చతుర్వేదికే కాదు
ఆత్మనిర్భరత శిక్షణ తనకు కూడా అవసరమేకదా.. అనుకుంది–

COMMENTS